సూర్యోదయం • జలంధర

"మీ కథ చాలా బావుంది. కానీ ముగింపే..." మొహమాటంగా అన్నాడు సూర్యం.

"ఏమిటిట ముగింపుకు?" అమాయకంగా అడిగింది ఆ పిల్ల. చుడీదార్‌లో పెద్ద పెద్ద బెంగాలీ రింగులతో ఎదురుగా కూర్చుని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ మాట్లాడుతున్న ఆ పిల్లకు సమాధానం చెప్పడం కొంచెం ఇబ్బందిగానే వున్నది సూర్యానికి.

మామూలు పరిస్థితుల్లో అయితే, చాలా నిర్మొహమాటంగా చెప్పగలడు:

కానీ, ఆ పత్రిక పెట్టిన బాస్ అంతకు ముందు సాయంత్రం పిలిచి.

"ఇదుగో చూడూ! రేపు ఒక పిల్ల ఏవో కథలు తీసుకు వస్తుంది... నీ మామూలు స్టైల్‌లో బెదిరించక, ఏదో ఒకటి దిద్ది వేసేయ్... అట్లా చూడకు... ఆ పిల్ల నా స్నేహితుడి కూతురు. పేరు చంద్రిక. ఒకప్పుడు గొప్ప జర్నలిస్టునైపోవాలని మద్రాసు వచ్చి పాండీ బజారు తురాయి చెట్ల కింద ఒన్ బై టూ కాఫీ కూడా దొరకని రోజుల్లో ఈ పిల్ల తండ్రే ప్రెస్ కొనిపెట్టి నన్ను నిలబెట్టి మనిషిని చేశాడు. అర్థమైందా!!"

బాస్‌కు ఎలా సూర్యాన్ని మాట్లాడించకుండా చెయ్యాలో తెలుసు; పైగా, ప్రపంచంలో ఎక్కడా ఇమడని సూర్యం అక్కడ పని చేస్తున్నాడంటే కారణం కేవలం బాస్ కనబడని అభిమానం, ఆత్మగౌరవాన్ని గౌరవించడం.

"ఏమిటండీ? మాట్లాడరేం?" ఆ పిల్ల మళ్ళీ రెట్టించింది. "అది కాదు – ఆ ముగింపులో మీ ఉద్దేశ్యం?"

నా ఉద్దేశ్యం ఏమిటీ అన్నది కాదు... మీరు ఆ ముగింపు "వద్దు" అనడంలో మీ ఉద్దేశ్యం ఏమిటి? అని..."

నిశ్శబ్దంగా చూశాడు ఆ పిల్లను... ఏమిటీ అమ్మాయి అసలు... చూడటానికి హాయిగా, ఆర్టిఫిషియాలిటీ, తెచ్చి పెట్టుకున్న మానర్స్ అవీ లేకుండా వుంది... కానీ, ఈ కథలు రాసే జబ్బేమిటసి?!

"చెప్పండి?" రెట్టించింది ఆ అమ్మాయి. టేబిల్ మీద పెన్సిల్ వేళ్ళ మధ్య అటూ యిటూ తిప్పతూ "ఒక అమ్మాయి, ఒక అబ్బాయిని చాలా అద్భుతమైన వ్యక్తిగా ఊహించుకుని, అతనికి విపరీతమైన శక్తులన్నీ ఆపాదించి, అతను నేను సామాన్యుణ్ణి మొర్రో అంటున్నా. "కాదు, నువ్వు మాన్యుడివి – అని అద్దమైన ప్రత్యేకతలు ఆపాదించి అతను అతి మామూలుగా కాలగర్భంలో కలసిపోతే... అతడి కోసం నది ఒడ్డున పిచ్చిదాన్లా "ఓ నా ప్రభూ తిరిగిరావా?" అని అరుస్తూ తిరుగుతోందని రాశారు కదా... క్షమించండి మేడం ఇదేదో సూపర్ నాచురల్ ఫిక్షన్ సినిమా ముగింపులా లేదూ?!

ఆ ధాటికి బిత్తరపోయిందేమో, రెండు క్షణాలు మాట్లాడలేదు ఆమె.

మెల్లిగా, "అయితే మీకు నా కథ అలా అర్థమైందన్న మాట?!" అన్నది అమాయకంగా మొహం పెట్టి.

ఫకాలున నవ్వేశాడు సూర్యం ఆమె భంగిమకు.

ఎందుకు నవ్వుతున్నారు?"

"నవ్వకేం చెయ్యమంటారు? ప్రతి రచయితా తాను ఊహించుకుని రచించినవన్నీ సీన్లతో సహా ఎదటి వాళ్ళకు తను అనుకున్నట్లు అనువాదమై పోతుందనుకుంటాడు. అందుకే దెబ్బతింటూ ఉంటాడు..."

"అంటే?" ఎర్రగా చూస్తూ అన్నది ఆ అమ్మాయి.

"అంటే..." కాలరు సర్దుకుని మరొకసారి తను చెప్పదలుచుకున్నది చెప్పాలన్న ప్రయత్నంలో అన్నాడు సూర్యం.

"అతను ఇప్పుడు ఈ మనిషి గురించి ఆలోచిస్తున్నాడు. ఈ మధ్యకాలంలో అతను ఆలోచించదగ్గ మనుష్యులే లేరని ఎప్పుడో నిర్ణయానికి వచ్చేశాడు మరి"

"అంటే... నాకు మీరు చెప్పినదాన్లో ముక్క అర్థం కాలేదు అని అర్థం. మీరు నా కథ వేసుకోరని అర్థం. అసలు మీకు... మీకు మా బోటి కొత్త రైటర్ల మీద సింపతీ లేదని అర్థం..."

"రామ రామ... ఇదెక్కడి పాప ఖర్మ... అది కాదండీ..." అక్కర్లేదు... నా కథ అసలు మీరు వెయ్యక్కర్లేదు... వస్తాను..." ఠపీమని స్ప్రింగ్ డోర్ వేసి మెరుపు తీగలా వెళ్ళిపోయింది ఆ అమ్మాయి.

ఆలోచించే లోపలే ఫోను మోగింది.

"చంద్రిక వెళ్ళిపోయిందా?"

"ఆ!... అది కాదు బాస్... ఆ అమ్మాయి చాలా కోపంగా..." ఎప్పుడూ ముక్కుకు సూటిగా ఫట్‌మని సమాధానం చెప్పే సూర్యం, చాలా రోజుల తరువాత మాట తడబడ్డాడు.

"ఆ కథ వేస్తానని చెప్పావా?"

ఏం చెప్తాడు?!

"తప్పకుండా వేద్దాం సార్... అది... ఫరవాలేదు లెండి... ఏవో చిన్న చిన్న మార్పులు... చూద్దాం లెండి..."

"మన పత్రికలో ప్రతి కథా అత్యుత్తమమైనదే వేస్తున్నామా. నువ్వు దిద్ది వేసెయ్యవోయ్..."

అదేగా తనూ అన్నాడు... అయినా అవే మాటలు ఆజ్ఞగా ఆయన చెప్పడం బాస్ లక్షణం. పైగా కథల క్వాలిటీ మీద చురక...

నవ్వుకుంటూ, ఆ కథ వంక చూస్తూ ఆలోచిస్తూ ఉండిపోయాడు సూర్యం.

* * *

"వెన్నెల" అనే ఆ పత్రిక ఆ కథ ప్రచురించింది. కానీ, అంతటితో ఆ కథ ప్రహసనం ముగిసిపోలేదు.

మరొకసారి తుఫానులాగా వచ్చింది చంద్రిక.

"ఏమిటండీ మీ ఉద్దేశ్యం? ఎందుకూ ఆ కథను మార్చారు? అవతలి వ్యక్తి ఆ అమ్మాయిని విపరీతంగా ఆరాధించినట్లు అందుకే ఆ పిల్ల పిచ్చిదైపోయినట్లు... ఇది అవసరమా?! ఏమిటా ముగింపు?!" దబాయిస్తూ అడిగింది.

"శాంతించండి మేడం... ఇదుగో కూల్ డ్రింక్ తాగండి ఆ! ఏమిటి అడిగారు? ముగింపు ఎందుకలా మార్చాను అనా?! మీ హీరో ప్రేమలో అంత ఇన్టెన్సిటీ..." చాలా సిన్సియారిటీ నటిస్తూ మాట్లాడుతున్నాడు కానీ...

అతని వ్యంగ్యానికి అతనికే నవ్వు వస్తోంది.

"ప్రేమ కాదు ఆరాధన..." చెప్పింది ఆ పిల్ల అస్సలు ఏం గ్రహించుకోనట్లు.

"ఓహ్! సారీ... ఆరాధన... అంత ఇన్టెన్సిటీ ఉండాలంటే అవతలి వ్యక్తిలో ఆ మాత్రపు కదలిక, వైబ్రేషన్... అవన్నీ ఉండాలిగా మేడం.

(పొరపాటున ఆ మాటలు అన్నందుకు అవే హెడ్డింగులుగా కథలు రాసెయ్యగలదని తెలిసి తరువాత చింతించవలసి వచ్చింది సూర్యం.)

"అట్లాంటివన్నీ ఉండాలని ఏం లేదండీ! అయినా అది నా కథ..."

"నిజమే... ఇదుగో చూడండి మీ కథ మెచ్చుకుంటూ ఎన్ని ఉత్తరాలు వచ్చాయో..." ఆమెను మాట తప్పిస్తూ అన్నాడు సూర్యం.

అవి చూస్తూ మౌనంగా వుండిపోయింది చంద్రిక.

బాస్‌లు ఉండొచ్చు. వాళ్ళకు ఉదారులైన స్నేహితులుండవచ్చు. వాళ్ళకు అందమైన కూతుళ్ళుండడం వల్ల పెద్ద ప్రమాదం లేదు... కానీ ఇలా కథలు రాసి ఇబ్బంది పెట్టకుండా ఉంటే బావుణ్ణు బాపూ రమణలు సృష్టించిన ఈ "బాస్ కుట్టి" బాధ ఎంత నిజం?! పైగా, తన టెంపర్‌మెంటుకు అస్సలు పడదు ఇదంతా!

ఈ అమ్మాయిలే మామూలుగా ఏ హైక్లాస్ ఫంక్షన్‌లోనో కనబడ్డా కనీసం పలకరించడం, మాట్లాడ్డం కష్టం. కానీ, కథల మోజు పాపం ఈ పిల్ల తన టేబుల్ దగ్గరకు వచ్చింది. అన్నీ బావున్నాయి కానీ ఈ కథలు రాసే పిచ్చేమిటని?!

"మీకు మరొక కథ ఇద్దామనుకుంటున్నాను..." చాలా గంభీరంగా అన్నది ఆ పిల్ల.

ఏం మాట్లాడతాడు ఆ పిల్లతో?!

ఈసారి కథనిండా ఏదో భయంకరమైన తత్వ విచారణ ఉన్నది.

"ఈ గోలేమిటండీ?... అయినా, మీకు ఇదేం బుద్ధి?!"

"ఏం మీకు అర్థంకావడం లేదా?!" జ్ఞానిలా జాలిగా నవ్వింది ఆ పిల్ల.

ఒళ్ళు మండిపోయింది సూర్యానికి.

"ఖర్మ..." నుదురు కొట్టుకుంటూ అన్నాడు.

"అర్థం, అనర్థం... అది కాదు ప్రశ్న... ఆ అమ్మాయి దిక్కు లేని పరిస్థితుల్లో వేశ్యా వృత్తికి దిగిందని నమ్మిద్దామని ప్రయత్నించారు. సరే... మరి ఈ తత్త్వ జిజ్ఞాస బోధేమిటి వచ్చిన వ్యక్తి కల్లా..."

"హతోస్మి..." అనుకోకుండా ఆ మాట బైటికి అనేశాడు సూర్యం.

సీరియస్‌గా చూసింది ఆ పిల్ల.

"ఏం?" తల ఎగరేస్తూ అడిగింది.

"అబ్బే... ఏం లేదు. ఈ కథ నేను మార్చి రాయకుండా, అలాగే పబ్లిష్ చేసి ఉంటే... ఇన్ని పొగడ్తలు రాకుండా ఉండి ఉంటే... మాకూ, మా పత్రికకు మళ్ళీ ఈ ప్రమాదం తప్పేది కదా అని..."

"అంతేనా... ఏమండి?!... నేను బాగా రాయలేనంటూరా?!"

స్తబ్ధ చలనం

ఎర్రని దీప కాంతి కనబడగానే
చక్రాలు మరి ముందుకి కదలక
చలనం ఆగిపోతుంది
మనోవేగం మరుక్షణంలో
ఆలోచనల ఆధీనమవుతుంది
వందమంది చుట్టూ ఆగినా,
మనిషికి మనిషికీ మధ్య
వేల ఇనుప తెరలు ఉంటాయి
నా గుండెలో గొప్ప దుఃఖం దాగుందనీ,
నలిబిలి చేసే నిర్దాక్షిణ్య సంఘటనల
గాలానికి మనసు ఎరగా మారి
మనుగడ కష్టమయిందనీ,
అవిరామంగా వర్షించే కళ్ళు
అవకాశం లేక పొడికళ్ళయ్యాయనీ,
గుర్తించని, గుర్తెరుగని జనం మధ్య
నిశ్చలంగా నిమిషం నిలబడితే
యుగాంతం ఎప్పుడన్న
ప్రశ్నే మిగులుతుంది
నిరంతరం నవ్వే హృదయం అలిసిపోయిందనీ,
అవ్యక్తానందంలో మునిగే మనసు ముసిలిదయిందనీ,
వాళ్ళకేం తెలుసు?
విడివడని పెదవుల వెనుక
వికసించని మొహం వెనుక
ఎన్ని దుఃఖ తీరాల్లో అలసిపోయానో!
ఎన్ని ఆటుపోట్లకు గురయ్యానో!
పసుపు ఆకుపచ్చనై అనుమతించిన
వెంటనే ఎంత రిలీఫ్...
నా బాధ, నా ఆంతర్యాన్ని విడిచి
జన సముద్రంలో నన్ను కలిపేసి,
నా ఆలోచనా రహస్తీరాల్ని తుడిచేసిన క్షణంలో
నా రెండు చక్రాల బండి ఎంతో
నేనూ అంతే

—డాక్టర్ సి.వి. పద్మజ

ఎక్కడ మర్యాద తప్పిన మాటలు వచ్చేస్తాయో నని అతను భయపడుతున్నాడు.

"ఏం? ఆవిడ వృత్తి అద్దైనంత మాత్రాన, ఆమెకు తత్త్వజ్ఞానం తెలియకూడదా?! అసలు ఆవిడకే ఎక్కువ తెలుస్తుందేమో..."

ఏడిచినట్లుంది పరిశోధన... కచ్చ పుట్టింది సూర్యానికి. "మహాతల్లీ! మీరొక మంచి పని చెయ్యండి. కథలకు థీం మేం యిస్తాం... మీరు మహా రచయిత్రిని అవ్వాలనుకుంటే వాటితో కథలు రాయండి..."

"అయితే, నా శిల్పం బావుందన్న మాట..." తల ఎగరేస్తూ అన్నది.

"బావున్నది అనడం కన్న థీం కొంత నయం"

"మరి భాష?"

"భాషా... మీరు ఏనాడో వత్తుల పెట్టి మర్చిపోయారు... మీకు మళ్ళీ ఒత్తులు, పొల్లులు, ఉభయాక్షరాలు వగైరా నేర్పాలి..."

ఏమాత్రం కోపం తెచ్చుకోలేదు. ఆ పిల్ల పైగా

"స్తో... శిల్పం భాష కన్నా థీం నయం అంటారు... అయితే నేను మీకు థీం యిస్తాను... మీరు కథ రాయండి... ప్రస్తుతానికి ఈ కథ వేసెయ్యండి... తరువాత చూద్దాం..." చచ్చినట్లు ఆ కథ మొదటి నుంచీ చివరి దాకా, దిద్ది మరీ వేశాడు సూర్యం.

చాలా మంచి ఉత్తరాలు వచ్చాయి. ఒకరిద్దరు మంచి రచయితల దగ్గర నుంచి ఆశీర్వచనాలు వచ్చాయి.

ఒక రోజు స్క్రిప్ట్‌లో ఒక కొటేషన్ కనిపించింది. "నిశ్శబ్దంలోకి పారిపోతున్నాను... నేను నీ నుంచి... నీలోకి..." అన్న వాక్యం చూసి ఉలిక్కిపడ్డాడు. ఏవేవో జ్ఞాపకాలు...

"ఏమండీ ఈ వాక్యం మీ సొంతమా?" అనుమానంగా అడిగాడు చంద్రికను.

అతడ్ని ఓరగా చూసి "పోనీ మీ సొంతమా?" అని అడిగి వెళ్ళిపోయింది.

యిలా కథల ప్రహసనం జరుగుతూ పోతే, చెప్పేందుకు పెద్ద ఏముంటుంది కానీ, ఒక పది మంచి కథలు అన్న పేరు వచ్చిన తరువాత.

ఒక భయంకరమైన సంచలనాత్మక, సందేశాత్మక విషయం జరిగింది సూర్యం జీవితంలో

"కంగ్రాట్స్" అంటూ ఫోన్లు వచ్చాయి.

"ఈ కథలన్నీ ఎడిటర్ సూర్యంగారివే... వారే చంద్రిక పేరుతో రాశారు. అనవసరంగా ఈ గౌరవం నాకు దక్కింది..." అని ఒక ప్రముఖ డైలీలో ఇంటర్వ్యూ ఇచ్చి కూర్చుంది చంద్రిక.

"దిక్కుమాలిన పరిస్థితిలో ఇరుక్కుపోయాను" అని వాపోయాడు సూర్యం... పైగా అతడ్ని ఎవరూ నమ్మడం లేదు. "నువ్వు కథలు రాయడం మానేసి పెద్ద సినిక్ వైపోయావు ఈ మధ్య కానీ, లేకపోతే నీ శైలి, శిల్పం మాకు తెలియనిదా?" అంటున్నారు సాహిత్య మిత్రులు.

ఛస్తే ఇంత బుద్ధి తక్కువ కథలు నేను రాయనుగాక రాయను..." అని గట్టిగా అరుద్దామన్నా నమ్మేవాళ్ళు లేరు. అతని పరిస్థితి అతనికే అగమ్యగోచరమైపోయింది.

పైగా

"నువ్వే మా చంద్రిక పేరు మీద కథలు రాస్తున్నావని నాకు మాట వరసకైనా చెప్పలేదేమయ్యా?! ఇంకేం... మంచి సీరియల్ రాసెయ్యి... స్టాఫ్ అని పేమెంటు ఇవ్వకండా ఉండనులే..." బాస్ జోకులు...

* * *

టెన్షన్ భరించలేక, నేరుగా చంద్రిక ఇంటికి వెళ్ళాడు సూర్యం.

"ఏమిటీ గోల అంతా... అసలు మీ ఉద్దేశ్యం ఏమిటి?! ఏనాడో రాయడం మానుకున్నాను నేను. ఈ ప్రారబ్ధం ఏమిటి నాకు...?! "ఏమాత్రం మొహమాటం లేకుండా అడిగేశాడు.

క్రోటన్స్ మీద ఎండ పడుతూంటే దాని వంకే సీరియస్‌గా చూస్తున్నట్లు మాట్లాడలేదు చంద్రిక.

మండిపోయింది అప్పటికే బలవంతాన రెండో సారి కాఫీ తాగిన సూర్యానికి.

"మాట్లాడరేమిటండీ?"

"అసలు మీరు కథలెందుకు రాయరు సూర్యం గారూ!"

"నేనా... నాకు జర్నలిజం అంటే యిష్టం... అదీ కాక కథ రాయాలంటే ఒక ప్రత్యేకమైన పద్ధతి, కథనం – ఇవన్నీ ఉండాలని నా ఉద్దేశం... అడ్డమైన వాళ్ళూ కథలు రాసెయ్యకూడదుగా..." కావాలనే కసిగా అన్నాడు.

"వీటన్నింటికన్నా మీకు ఇగో ప్రాబ్లం... నా అంతటి వాడు కథ రాస్తే, బాగా లేదంటారేమో నని..."

"అది కూడా అయ్యుండచ్చు..." విసుగు పుట్టి ఒప్పుకున్నాడు సూర్యం... ఇంతకీ ఏమంటావు తల్లీ! అనుకుంటూ.

"మరి ఇప్పుడు ఈ కథలన్నీ..."

"మళ్ళీ అదే మాట అంటార్య ఈ కథలు నావా?!"



"ఆ మీవే..."

"ఏమిటి మీరనేది?"

"ఇప్పుడే వస్తాను" లోపలికి వెళ్ళి ఒక ఎర్రటి డైరీ తెచ్చింది చంద్రిక.

"ఇది మీదేనా?" అడిగింది.

"ఇదా... ఇది... అరె... ఇది మీకెలా?... చాలా రోజుల క్రితం ఇది పారేసు కున్నాను..."

"ఎక్కడ?" సూటిగా చూస్తూ అడిగింది చంద్రిక.

'జ్ఞాపకం లేదు..." ఆలోచిస్తూ అన్నాడు సూర్యం.

అతని వంకే కన్నార్పకుండా చూస్తోంది ఆమె.

ఆ ఖరీదైన భవనంలో ఆమె ఒక అలంకారంలా వున్నది.

ఆమె ఎర్రటి గోళ్ళ రంగుల్లో తెల్లటి పాదం వంక ఎనామిల్ చేసిన పట్టాల వంక, ఆమె పాదాల క్రింద కార్పెట్ వంక, ఆ కార్పెట్ కింద పాల రాతి వంక చల్లటి ఇండోర్ ప్లాంట్సు వంక మార్చి మార్చి చూస్తున్నాడు సూర్యం.

అతను ఇప్పుడు ఈ మనిషి గురించి ఆలోచిస్తున్నాడు. ఆ మధ్య కాలంలో అతను ఆలోచించదగ్గ మనుష్యులే లేరని ఎప్పుడో నిర్ణయానికి వచ్చేశాడు మరి.

'అసలు ఈ డైరీ..." టేబిల్ మీద నుంచి తీసుకొని మెల్లిగా తెరిచాడు.

ఏవేవో పిచ్చి పిచ్చి కవిత్వాలు, రాతలు, ప్రతి విషయం అప్పడొక ఇన్స్పిరేషన్ పక్కింటి అయ్యంగారి అమ్మాయి. బీచ్ ఒడ్డున మత్స్యగంధి, పార్థసారథి గుడి దగ్గర కదంబాల అమ్మే ముక్కు బేసరి పిల్ల, చీకట్లో నీడల చాటున శరీరాన్ని ఖరీదుకు పెట్టిన బి.ఎ. ఫిలాసఫీ అమ్మాయి, ఇలా ఎన్నో ఎన్నెన్నో... ఆలోచనల అలలు... అవి ఇచ్చిన కలలు... ఒకటనేమిటి!

ఆ రాతలు అతనికే నవ్వు తెప్పిస్తున్నాయి. ఎంత కవిత్వం? అందులో ఎంత విభ్రాంతి? జీవితం పట్ల ఎంత నమ్మకం? ఎంత అర్థం కాని అమాయకత్వం?!

ఆ తరువాత జీవితంలో నీ దగ్గర ఏముంది తాకట్టుకు? అంటూ ఆత్మగౌరవం దగ్గర నుంచి ఖరీదు కట్టే మనుష్యుల్ని చూసి నలిగిపోయాడు అతను మానసికంగా...

అయినా... ఈ డైరీ మీ దగ్గరకు ఎలా..."

ముందు అవన్నీ ఈ పిల్ల చదివిందంటేనే భయంగా ఉన్నది సూర్యానికి.

"ఇది రెండు సంవత్సరాల క్రితం క్యాన్సర్ యిన్‌స్టిట్యూట్‌లో వదిలిపెట్టారు. మీ ఫ్రెండ్‌ను చెకింగ్ తీసుకు వచ్చారు గుర్తుందా?!

"అవునా... జ్ఞాపకం లేదు... మరి మీకు ఎలా?

"దొరికింది..."

'అదే... ఎలా అని?"

"ఆ రోజు చెకింగ్‌కు నేనూ వచ్చాను కాబట్టి... మీకు వెనక వరసలో ఉన్నాను కాబట్టి...

"ఓహో... అదా సంగతి... అయినా అడ్రస్ ఉన్నదిగా పోస్ట్ చేసెయ్యక పోయారా?!"

"ముందు అలా చేద్దామనే అనిపించింది. కానీ..." "కానీ అది పెద్ద మనిషి తరహా ఉన్న వాళ్ళ లక్షణం... అది మనకేది?! ఎదటి వాళ్ళను వీలైనంత ఇబ్బందుల్లో పడెయ్యడం తప్ప..." కావాలనే ఎద్దేవగా అన్నాడు.

నవ్వేసింది చంద్రిక.

"ఆ డైరీ చదివాను... అందులో నాకు అక్షరాలతో అనువాదం చెయ్యబడ్డ ఒక గొప్ప వ్యక్తి మూర్తీభవించి కనబడ్డారు... ఆశ్చర్యపోయాను. ఆ ఆర్ద్రతకు, ఆ కవిత్వానికి..." సున్నితంగా చెబుతోంది ఆ పిల్ల.

"ఏడిసినట్లుంది... ఎవరూ చూడరనుకుంటే చాలా మంది చాలా గొప్పగా రాసు కుంటారు డైరీల్లో. మీ అదృష్టం బావుంది. అవాకులూ, చవాకులు రాశాను కాదు..." లైట్‌గా అన్నాడు సూర్యం.

సీరియస్‌గా చూస్తూ అన్నది చంద్రిక.

"మీరు చెత్త రాయలేరు సూర్యం. రాయడం చేతకాదు మీకు... మీరు బ్రతుకు తెరువు కోసరం ప్రపంచం కోసరం మూర్ఖత్వం నటించవచ్చు. కానీ మీ లోపల ఒక గొప్ప వ్యక్తి ఉన్నాడు. అది వారాలు అనాథ పిల్లలతో కలిసిపోయే మంచి బాలుడు ఉన్నాడు. ఫ్రీ స్కూలు నడుపుతున్న జ్ఞాని ఉన్నాడు. ప్రపంచం నాకేమీ ఇవ్వకపోయినా సరే, నాకు తోచింది నేను చేస్తాననే కర్మ జీవి ఉన్నాడు, కవి ఉన్నాడు, రచయిత ఉన్నాడు."

"అయ్యబాబోయ్... ఇవన్నీ నేనే?! చంద్రిక గారూ... మీకు నేనేం ద్రోహం చేశానండీ ఇన్ని రకాలుగా నా మీద కక్ష తీర్చుకుంటున్నారు..."

"మీరు ఒప్పకోలేరు... నాకు తెలుసు. మీ డైరీ నాకు మీ గురించి చాలా చాలా చెప్పింది. నాకు ఈ వ్యక్తి ఎవరా? అని కుతూహలం పెరిగింది. మీ గురించి కూలంకషంగా ఎంక్వైరీ చేశాను... ఆ తరువాతే నా కథలతో మీ టేబిల్ దగ్గర ప్రత్యక్షమయ్యాను..."

జ్ఞాపక జ్వాలనం

గాయపడినప్పుడే కాదు
ఆనందం ఆర్ణవమైనప్పుడూ, నేను
జ్ఞాపకాల మూట విప్పుతాను.
జ్ఞాపకాలు వేనవేలు.
ఒక్కొక్కసారి జ్ఞాపకం
తీగలా సాగి సాగి
గుండె గుడారంలో సుళ్ళు తిరుగుతుంది.
మరోసారి
అగాధం అంచున నిల్చున్నట్లు
నన్ను భయకంపితను చేస్తుంది.
ఇంకొక్కసారి
దారుణ క్షణాలమీద ముళ్ళ నడకై
నా మనసు మీద నెత్తుటి ముద్ర వేస్తుంది.
అప్పుడప్పుడూ
మానిన గాయాల్ని గీరి గీరి
కెలికి, కెలికి పుండు చేసుకుంటుంది.

తిరిగి తనే నిమురుకుంటుంది.
అయితే ఒక్కసారి
ఒకే ఒక్కసారి మాత్రం, నీ జ్ఞాపకం
సుమ సౌరభమై, భావ పరిమళమై
నా ఎదనిండా పరుచుకుంటుంది.
జ్ఞాపకాల తీయని బాధ
మోయలేని బరువవుతుంది.
అందుకే జ్ఞాపకం చిత్రమైంది.
ఒకరి జ్ఞాపకాల మంటల్లో
వేరొక రెప్పటికీ దూకలేరు.
మరొకరి జ్ఞాపకాల గాయాల్ని
వేరొకరెప్పటికీ నిమరలేరు.
అందుకే నా జ్ఞాపకాల్లో నేనే
అంతర్జ్వలిస్తూ.... యిలా...

— వి.ప్రతిమ



"మనిద్దరికి పెళ్ళికుదిరిన సందర్భంలో నీకు నేనొక నెక్లెస్ ప్రజెంట్ చేద్దామనుకుంటున్నా. ఏది కావాలో చెప్పు. అన్నట్టు ఇరవై నాలుగు కారట్లా? ఇరవై రెండు కారట్లా" ఫోనులో కాబోయే భార్యని ప్రశ్నించాడు సురేష్.

"ఇరవై నాలుగు కారెట్లు తినడానికి నేనేమైనా మేకననుకున్నావా? బర్రెననుకున్నావా?" విసురుగా ఫోన్ పెట్టేసింది వాణి.

– గొల్లపూడి శైలజ

"మా బాస్ రికమెండేషన్‌తో... ఒప్పుకోండి ముందు... అలా కాకపోయినట్లైతే నాకీ ప్రమాదాలన్నీ తప్పేవి..."

"పోనీ అంతే అనుకోండి... కానీ నా సబ్జెక్ట్ అంతా చెత్త అని తిట్టే వారే. కానీ, ప్రతి థీం మీదే సూర్యం... మీరు రాసిన ప్రతి కథా మీదే...

ఆ అమ్మాయి గొంతులో ఏవో మంచుకొండల్ని కరిగించే ఆప్యాయతల వెచ్చదనం.

ఉక్కిరి బిక్కిరి అయ్యాడు సూర్యం.

అతనికి గుండె గొంతులోన కొట్లాడ్డం... అంటే ఏమిటో అర్థమవుతోంది. ఇంక అక్కడే ఉంటే అనవసరంగా ఏం మాట్లాడతానో అని భయపడ్డాడు.

"చాలా చాలా థ్యాంక్స్ అండీ... ఇలా చెప్పాలని లేకపోయినా తప్పదు మరి. నన్ను... నన్ను రచయితగా ప్రపంచానికి అనవసరంగా డిక్లేర్ చేశారు. చచ్చినట్లు అలా బ్రతక్కా తప్పదు.

ఇది తియ్యటి శాపం... ఇంక ఏమైపోతానో ఏమిటో..." కావాలనే అల్లరిగా అంటూ లేచి నిలబడ్డాడు సూర్యం.

"నమస్కారం... వెళ్ళిరండి..."

"అదేమిటి... మళ్ళీ రమ్మంటున్నారు?! రావచ్చా..." తెచ్చి పెట్టుకున్న అమాయ కత్వంతో అడిగాడు.

"మళ్ళీనా... రండి... నేను ఉంటే..." నవ్వుతూ అన్నది చంద్రిక. సందు మలుపు తిరిగే దాకా చెయ్యి ఊపుతూనే ఉన్నది.

* * *

"సూర్యం... తొందరగా బయలుదేరు..."

బలవంతంగా కారులో కూర్చోపెట్టాడు సూర్యాన్ని బాస్ ఎక్కడికో అర్థం కాలేదు అతనికి.

హాస్పిటల్ ముందు ఆగింది కారు.

"చంద్రికకు చాలా సీరియస్‌గా ఉంది..." చెబుతూనే ఏ.సి. రూంలోకి అడుగు పెట్టాడు ఆయన.

"అదేమిటండీ!" అంటూనే లోపలికి వెళ్లాడు సూర్యం.

రకరకాల ట్యూబులు, ఆక్సిజన్ సిలెండరు...

ఆమె స్పృహలో లేదు...

మౌనంగా పది నిముషాలు నిలబడి బైటకు వచ్చేశారు ఇద్దరూ.

"ఏమిటి బాస్" అయోమయంగా అన్నాడు సూర్యం.

"ఆ పిల్లకు క్యాన్సరు... అడ్వాన్స్‌డ్ స్టేజి... ఎక్కువ కాలం బ్రతకదు...రోజులు... అంతే..."

"బాస్..." గట్టిగా అన్నాడు సూర్యం.

ఆ పిల్ల క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ చెకింగ్ అన్నది ఆ రోజు... తను అర్థం చేసుకోడానికి ప్రయత్నించలేదు. లేకపోతే తన భాషలో చెప్పాలంటే, అంత సౌందర్య సౌజన్యమూర్తి గురించిన ఆ చేదు నిజం సబ్ కాన్షియస్ రిజిస్టర్ చెయ్యడానికి ఎదురు తిరిగి వుంటుంది.

అతడ్ని దుఃఖాన్ని మించిన ఏదో భయంకరమైన స్థితి ఆవరించింది. అర్థం లేనంత వేగంగా అతని పెన్ను నర్తిస్తోంది.

"చంద్రికా..."

ఆ మర్నాడు వెళ్ళాడు.

తల తిప్పి, అతడ్ని చూసి నవ్వింది. నీరసంగా ఉన్నది కానీ, ట్యూబులు డాక్టర్ల హడావిడి లేదు ఆ రోజు.

"ఇదుగో..."

"చంద్రోదయం..." అన్న మకుటంతో అతని కవిత్వం తన స్నేహితురాలు, శ్రేయోభిలాషిణి అయిన ఆ యువతి కోసం అతని దుఃఖం అంతా అక్షర మాలికగా మారింది.

చదివింది ఆమె... కళ్ళల్లో నీరు తిరిగాయి.

"అద్భుతంగా ఉన్నది కవిత్వం... కానీ, ఎడిటరు గారూ! మకుటం మార్చాలండీ! ఇవి చంద్రికాస్తమయం... ఇక చంద్రికకు ఉదయమేమిటి... ఇలా ఇవ్వండి పెన్ను... ఇది సూర్యోదయం..." తనే రాస్తూ అన్నది.

చంద్రికా..." అతని పెదవుల మీద వినబడని మాటలు, భావాలుగా ఆమెను తాకుతున్నాయి.

అర్థమైంది ఆమె జీవశక్తి కోల్పోతున్న కళ్లకు.

* * *

సముద్రపు ఇసుక... అలల వంక చూస్తూ అతను...

"నేస్తం... ఎక్కడున్నావు? తిరిగిరా! చంద్రోదయంగా రా! వెన్నెలగా మారి పోయావా?! నా పిలుపు నీకు వినబడటం లేదా?!..." అంటూ అలలపైన చందమామను చూస్తూ అడుగులు వేస్తూ తిరుగుతున్నాడు ఆ వ్యక్తి...

"ఇల్లాంటి ముగింపు మీ భాషలో చెప్పాలంటే చాలా కృతకంగా లేదూ ఎడిటర్ గారూ..."

పాల వెన్నెల సముద్రం మీద నుంచి ఫకాలు నవ్వుతూ!

అడిగినట్లనిపించిందతనికి.

ఏమంటాడు అతను?!